## పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు అద్భుతం

• సుప్రీం కోర్టు జడ్జి నాగరత్నం


పోచంపల్లిలో ఇక్కత్ వస్త్రాలను పరిశీలిస్తున్న సుప్రీం కోర్టు జడ్జి నాగరత్నం

భూదాన్ పోచంపల్లి, మార్చి 29 : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు అద్భుతంగా ఉన్నాయని సుప్రీం కోర్టు జడ్జి పీవీ నాగరత్నం అన్నారు. పట్టణ కేంద్రంలోని కళా పునర్వి హ్యాండ్లూమ్ యూనిట్, కొండ లక్ష్మణ్ బాపూజీ కాంప్లెక్స్‌లోని చేనేత ప్రైవేట్ దుకాణాలను శుక్రవారం ఆమె సందర్శించారు. సిల్క్ దారం తయారీ, చిటికీలు చుట్టడం, రంగుల అద్దకం, చేనేత మగ్గాలు, వస్త్రాల తయారీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరెలను తిలకించారు. కళాకారుల నైపుణ్యాన్ని ఆమె కొనియాడారు. ఆ తర్వాత టూరిజం సెంటర్‌ను సందర్శించి, భూదానోద్యమానికి సంబంధించిన చిత్రాలను పరిశీలించారు. ఆమె వెంట న్యాయవాదులు ఉన్నారు.

# రైతన్నకు అండగా కేసీఆర్ రాక



**రేపు సూర్యాపేట, నల్లగొండ, జనగాం జిల్లాల్లో పర్యటన**

• ఎండిన పంటల పరిశీలన
• రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకోనున్న రైతు బాంధవుడు
• ఏర్పాట్లలో నిమగ్నమైన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

నల్లగొండ ప్రతినిధి, మార్చి29(నమస్తే తెలంగాణ) : ఎండిన పంట పొలాలను పరిశీలించి రైతుల ఇబ్బందులను స్వయంగా తెలుసుకునేందుకు బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యేలు, నేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోపాటు సాగునీటి ప్రణాళిక కొరవడడంతో ఉమ్మడి జిల్లాలో సుమారు మూడు లక్షల ఎకరాల్లో పంటలు ఎండినట్లు అంచనా. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత వారం రోజులుగా ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో స్థానిక మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో కలిసి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పర్యటించారు. రైతుల ఇబ్బందులు, నష్టం, ప్రభుత్వం తీరు తదితర అంశాలను పరిశీలించారు. రైతుల కష్టాలను చూసి చలించిపోయారు. ఇదే సందర్భంగా గతంలో కేసీఆర్ సర్కార్ ఇలాంటి సందర్భాల్లో ఎలా వ్యవహరించిందో కూడా గుర్తు చేశారు. జిల్లాలో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల బాధ్యతారహిత వైఖరిని కూడా ఎండ గట్టారు. తన పర్యటనలో గుర్తించిన అంశాలను ఒక నివేదికగా పార్టీ అధినేత కేసీఆర్‌కు జగదీశ్ రెడ్డి అందజేశారు. కరువు పరిస్థితులు, రైతుల ఇక్కట్లు, ప్రభుత్వ నిర్లక్ష్యం ధోరణి వంటి అంశాలపై శుక్రవారం సాయంత్రం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి..ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్‌తో కలిసి కేసీఆర్‌తో చర్చించారు. దాంతో కేసీఆర్ చలించిపోయినట్లు తెలిసింది. వెంటనే రైతుల ఇబ్బందులను స్వయంగా పరిశీలించి, ధైర్యం చెప్పేందుకు తానే జిల్లా పర్యటనకు వస్తున్నట్లు కేసీఆర్ చెప్పారు. అందులో భాగంగా ఈ నెల 31వ తేదీన కేసీఆర్ పర్యటనను అక్కడికక్కడే ఖరారు చేశారు. ఎర్రవెల్లి ఫామ్ హౌస్ నుంచి బయలుదేరి ముందుగా జనగాం నియోజకవర్గంలో పర్యటనకు వెళ్తారు. అక్కడి నుంచి తుంగతుర్తి నియోజకవర్గంలోని అర్వపల్లి మండలంలో ఎండిన పంటలను పరిశీలిస్తారు. అనంతరం సూర్యాపేటకు చేరుకొని మీడియా సమావేశంలో పాల్గొంటారు. అక్కడే మధ్యాహ్న భోజనం చేస్తారు. అక్కడి నుంచి నల్లగొండ జిల్లాలోని సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలోని నాగార్జున సాగర్ నియోజకవర్గం హాలియాలో పర్యటిస్తారు. అక్కడ ఎండిన పంటలను పరిశీలించి రైతులతో భేటీ అవుతారు. తరువాత హైదరాబాద్ బయల్దేరి వెళ్లనున్నట్లు తెలిసింది. కాగా మాజీ సీఎం కేసీఆర్ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌పై శనివారం స్పష్టత రానుంది. శుక్రవారం రాత్రి వరకు ప్రాథమికంగా ఖరారైన ప్రకారం పార్టీ నేతలు అధినేత పర్యటన ఏర్పాట్లపై దృష్టి సారించారు.


సంస్థాన్‌నారాయణపురంలో ఎండిపోయిన వరిచేనులో మేస్తున్న గొర్రెలు

## పొట్ట మీది పంట.. పశువులకు మేతాయె

**అడుగంటిన భూగర్భ జలంతో ఎండుతున్న పంటలు**

• సంస్థాన్‌నారాయణపురంలో 3వేల ఎకరాల్లో ఎండిన వరి చేలు
• పంటలను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో పొలానికి తడి

సంస్థాన్ నారాయణపురం, మార్చి 29 : సంస్థాన్‌నారాయణపురం మండలంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడు ఆశించిన వర్షాలు కురువక పోవడంతో చెరువులు, కుంటలు ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటాయి. వ్యవసాయ బోర్ల నుంచి చుక్క నీరు రాక పోవడంతో యాసంగిలో సాగు చేసిన వరి పొలాలు ఎండిపోతున్నాయి. నీళ్లులేక వరిచేలు నెర్రెలు బారుతున్నాయి. పొట్టదశకు చేరిన వరి పంటలు ఎండిపోతుండడంతో రైతులు కన్నీళ్లు పెడుతున్నారు.

### 3 వేల ఎకరాల్లో ఎండిన పొలాలు

మండల వ్యాప్తంగా యాసంగిలో 9,700 ఎకరాల్లో వరి సాగవగా ఇప్పటికే సుమారు 3 వేల ఎకరాల్లో నీళ్లు లేక పంటలు ఎండిపోయినట్లు రైతులు తెలిపారు. మరో 15 రోజుల్లో పంట చేతికి వచ్చే సమయంలో బోర్లు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు పంటను కాపాడుకునేందుకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి చేలను తడుపుతున్నారు. ఇలా రోజుకు రూ. 7వేల వరకు ఖర్చు పెడుతున్నట్లు రైతులు తెలిపారు. నీళ్లు అందక ఎండిన వరి పొలాలను గొర్రెలు, పశువులకు మేతగా వదిలేస్తున్నారు. లక్షలు పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. పెట్టిన పెట్టుబడికి తిండి గింజలు కూడా వచ్చే అవకాశం లేదని, గత పదేండ్లలో ఇలాంటి పరిస్థితి చూడలేదని రైతులు పేర్కొంటున్నారు.

### రోజూ 10 ట్యాంకర్ల నీళ్లు పెడుతున్నా



నాకున్న నాలుగున్నర ఎకరాల్లో వరి సాగు చేసిన. నీళ్ల కోసం 6 బోర్లు ఏపించిన. కానీ అందులో ఐదు బోర్లు మొత్తమే ఎండిపోయినై. ఉన్న ఒక్క బోరు కూడా కొద్ది మాత్రం నీళ్లు పోస్తున్నది. పంట చేతికొచ్చే సమయానికి బోర్లు ఎండిపోవడంతో రోజుకు 10 వాటర్ ట్యాంకర్లతో చేలకు నీళ్లు పెడుతున్న. నీళ్లకు రోజుకు రూ. 7వేలు ఖర్చవుతున్నాయి. పోయిన సారి పంట బ్రహ్మాండగా పండడంతో పెట్టుబడి పోను లక్ష రూపాయలు చేతికొచ్చినై. ఈ సారి పెట్టుబడి కూడా వచ్చేటట్లు కనబడ్తలేదు.

–ఉప్పల శ్రీను, రైతు, సంస్థాన్‌నారాయణపురం

# సర్కారు నిర్లక్ష్యంతో వ్యవసాయ సంక్షోభం

• సాగునీరు ఇవ్వాలన్న కనీస సోయి లేదు
• నీళ్లు లేక ఎండారిగా మారిన ఎస్సారెస్పీ ఆయకట్టు
• మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
• తుంగతుర్తి మండలంలో ఎండిన వరి పంటల పరిశీలన


తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో ఎండిన పంటలను పరిశీలిస్తూ రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్

తుంగతుర్తి, మార్చి 29 : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో వ్యవసాయం సంక్షోభంలోకి వెళ్లిందని, కాళేశ్వరం ప్రాజెక్టును వృథాగా మార్చి ఎస్సారెస్పీ ఆయకట్టును ఎడారిలా చేశారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. తుంగతుర్తి మండలంలోని వెలుగుపల్లి, సింగారంతండా, మొండికుంట తండాలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి ఎండిపోయిన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్‌పై అక్కసుతో కాంగ్రెస్ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టును నిష్ప్రయోజనం చేశారని మండిపడ్డారు. నీటిని ఎత్తిపోసి కష్ట కాలంలో ఉన్న రైతులకు ఇవ్వాలన్న కనీస సోయి ప్రభుత్వానికి లేదని దుయ్యబట్టారు. నేడు ఏ గ్రామానికి వెళ్లినా నీళ్లు లేక ఎండిన పంట పొలాలతో రైతులు బోరున విలపిస్తున్నారని, ఎండిన పంటలను మంత్రులు గానీ, ఎమ్మెల్యేలుగానీ పరిశీలించకపోవడం దారుణని తెలిపారు. మంత్రులకు దమ్ముంటే రైతుల వద్దకు వెళ్లి ఎండిన పంటల వివరాలను తెలుసుకోవాలన్నారు. ప్రకృతి తెచ్చిన కరువు కంటే పాలకుల నిర్లక్ష్యం, అవగాహనా రాహిత్యం వల్లే పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ మీద కోపంతో సాగునీరు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీ ఫేజ్ –2 కింద సాగు నీరు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పి రైతులను మోసం చేసిందని, 15రోజులు నీళ్లు రాకపోవడంతో పంటలు ఎండిపోయాయని పేర్కొన్నారు. కాళేశ్వరం ద్వారా నీటిని ఎత్తిపోస్తే నేడు ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. తుంగతుర్తి మండలంలో వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, ప్రతి రైతుకు ఎకరాకు రూ.25వేల నష్ట పరిహారం ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు రేవంత్ సర్కారు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ, పంటలకు రూ.500 బోనస్, పూర్తి స్థాయిలో రైతు భరోసా ఇవ్వాలన్నారు. వారి వెంట బీఆర్‌ఎస్వీ జిల్లా కో–ఆర్డినేటర్ కల్లెట్లపల్లి శోభన్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, వైస్ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, ఎంపీటీసీ కవి, నాయకులు ఎస్‌ఏ రజాక్, సోమశేఖర్‌గౌడ్, గుండగాని రాములు, సురేశ్‌గౌడ్, కల్లెట్లపల్లి ఉప్పలయ్య, రఘునందన్‌రెడ్డి, శంకర్‌నాయక్, మామిడి వెంకన్న ఉన్నారు.


నిలిచిపోయిన తాళ్లవీరప్పగూడెం ఎత్తిపోతల పథకం పనులు

## నిలిచిన తాళ్లవీరప్పగూడెం ఎత్తిపోతల పనులు

• బిల్లులు రాక పనులు ఆపేసిన కాంట్రాక్టర్
• రూ.229.90 కోట్లు మంజూరు చేసిన బీఆర్‌ఎస్ సర్కారు
• ఇప్పటికే 40 శాతం పనులు పూర్తి

దామరచర్ల, మార్చి 29 : చుట్టూ నీటి వనరులు ఉన్నా వినియోగించుకోలేని పరిస్థితుల్లో ఎత్తిపోతల పథకానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా దామరచర్ల మండలంలోని తాళ్ల వీరప్పగూడెం వద్ద అన్నవేరు, కృష్ణానది సంగమం వద్ద ఎత్తిపోతల పథకాన్ని తీసుకొచ్చింది. మండలంలో 12,610 ఎకరాలు సాగులోకి తీసుకొచ్చేందుకు రూ.229.90 కోట్లు మంజూరు చేసి పనులను ప్రారంభించింది. ఇప్పటికే 40 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. కానీ గత నెల రోజులుగా పనులు జరుగడం లేదు. సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేసినట్లు తెలిసింది. మండలంలోని సుమారు 21 గ్రామాలకు నీరు అందించే బృహత్తర పథకం పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో రైతులు, గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనితోపాటుగా ప్రారంభించిన సాగర్ నియోజక వర్గంలోని నెల్లికల్లు ఎత్తిపోతల పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరో విడుత నిధులు విడుదల చేసి పనులు ముమ్మరం చేసింది. కానీ తాళ్ల వీరప్పగూడెం ఎత్తిపోతల పథకాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే దామరచర్ల మండలం సస్యశ్యామలంగా మారుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.


సూర్యాపేటలో శిలువ ప్రదర్శన

### భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

*ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు శిలువ ఘట్టాలను ప్రదర్శించారు.*


నల్లగొండలో..

## కాంగ్రెస్‌ది అరాచక పాలన

• మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు


బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ, మార్చి 29 : రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన నడుస్తుందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. పట్టణంలోని రెడ్డికాలనీలో నిర్మించిన బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలెవరూ అధైర్యపడవద్దని, ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా తాను, బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఇక నుంచి నియోజకవర్గ ప్రజలు పార్టీ కార్యాలయానికి నేరుగా రావచ్చని తెలిపారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు వంద రోజుల్లోనే భ్రమలు తొలగిపోయాయన్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో ప్రాణాలకు ఎదురొడ్డి పోరాడిన శ్రీకాంతాచారి, యాదయ్య, వేణుగోపాల్‌రెడ్డి పుట్టిన నేల మీదనే తాను పుట్టానని, పోరాటమంటే భయపడనని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, అడవిదేవులపల్లి ఎంపీపీ బాలాజీనాయక్, జడ్పీటీసీలు ఆంగోతు లలితహాతీరాంనాయక్, కుర్ర సేవ్యానాయక్, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మోసిన్ అలీ, పార్టీ నాయకులు నల్లమోతు సిద్ధార్థ, చిట్టిబాబునాయక్, సంపత్, మందడి సైదిరెడ్డి, కరుణాకర్ రెడ్డి, సైదులుయాదవ్, బాబయ్య, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఖాతాదారుల సొమ్ము కొట్టేశాడు


• బ్యాంక్ ఉద్యోగిపై కేసు నమోదు


విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ బీసన్న

నందికొండ, మార్చి 29 : ఖాతాదారులు డిపాజిట్ చేసిన నగదును వాడుకున్న బ్యాంక్ ఉద్యోగిపై కేసు నమోదు చేసినట్లు నాగార్జునసాగర్ సర్కిల్ సీఐ బీసన్న తెలిపారు. విజయపురి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నందికొండ హిల్ కాలనీలోని గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో తిరుమలగిరి మండలం జానారెడ్డి కాలనీకి చెందిన కేతావత్ గిరీశ్ ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. డిసెంబర్ నెలలో బ్యాంకులో ఖాతాదారులు డిపాజిట్ చేసిన 6,57,000 నగదును సొంతానికి వాడుకున్నట్లు బ్యాంక్ అధికారులు గుర్తించి విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు గిరీశ్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి బ్యాంక్‌లో ఖాతాదారులు డిపాజిట్ చేసిన సొమ్ముతోపాటు తన సొంత ఆస్తులు అమ్మి రూ.40 లక్షల వరకు పోగొట్టుకున్నట్లు విచారణలో తెలిసింది. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## పదేండ్ల తర్వాత ఎండిన నల్లచౌట చెరువు

నిడమనూరు, మార్చి 29 : మండల కేంద్రంలోని నల్లచౌట చెరువు నీళ్లు లేక వెలవెలబోతున్నది. 1986లో నల్లగొండ జిల్లా కేంద్రానికి ముప్పారం మంచినీటి పథకం ద్వారా నీటిని అందించేందుకు రిజర్వాయర్‌గా మార్చారు. నాటి నుంచి చెరువు నీటితో కళకళలాడింది. గత నాలుగు నెలలుగా చెరువులో ఉన్న నీటిని వృథాగా దిగువకు వదలడంతో క్రమేపీ ఖాళీ అవుతూ వచ్చింది. ఇటీవల ప్రభుత్వం ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయకపోవడంతో చెరువు పూర్తిగా ఎండిపోయింది. దీనికి తోడు చెరువు కింద పంటలు సాగు చేసిన రైతులు వాటిని కాపాడుకునేందుకు ఇష్టారాజ్యంగా చెరువు నీటిని తూముల ద్వారా తరలించుకుపోయారు. ఈ కారణంగా చెరువు పూర్తిగా ఖాళీ అయ్యి మైదానాన్ని తలపిస్తున్నది. 2013లో ఫైలిన్ తుఫాన్ ప్రభావంతో చెరువుకు గండిపడటంతో సుమారు రెండేండ్లు చెరువులో నీరు చేరలేదు. 2014లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెరువు గండి పూడ్చివేత పనులు చేపట్టారు. దశాబ్ద కాలంగా కళకళలాడిన చెరువు ఎండడంతో ప్రస్తుతం భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయి. సాగు నీటితోపాటు తాగు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.


నిడమనూరులో పూర్తిగా ఎండిన నల్లచౌట చెరువు

## వైజాక్ కాలనీలో పర్యాటక బోట్లు నిషేధం

నేరేడుగొమ్ము(చందంపేట), మార్చి 29 : మండలంలోని కృష్ణా వెనుక జలాల సమీపంలోని వైజాక్ కాలనీ వద్ద పర్యాటక బోట్లను నిషేధించినట్లు నేరేడుగొమ్ము ఎస్‌ఐ సతీశ్ తెలిపారు. ఇటీవల పర్యాటకులు మృత్యువాతపడిన ఘటనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సరదాగా గడిపేందుకు వచ్చే పర్యాటకులు ఈత కొట్టడం, బోట్లు ఎక్కడంతో ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. దీనిపై ఇప్పటికే మర బోట్ల యజమానులకు నోటీసులు జారీ చేశాయని, పర్యాటకులు, బోట్ల యజమానులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.